పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# ప్రభుత్వ పాఠశాలల టాపర్లకు ఘన సన్మానం..
# మానవహారంలో పాల్గొన్న..ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి..






కావలి, పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) మే:7 కావలి పట్టణంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ట్రంక్ రోడ్‌లోని సెల్ఫ్ పాయింట్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అద్భుతంగా ముందుకు సాగుతోందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధిస్తూ ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కావలి గాయత్రి నగర్‌లో 'కావ్యన్న చలివేంద్రం'
# ప్రారంభించిన..ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి..




కావలి : పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) మే :7 నెల్లూరు జిల్లా, కావలి పట్టణంలోని గాయత్రి నగర్‌లో దేవరకొండ శ్రీను వాటర్ ప్లాంట్ వద్ద దేవరకొండ శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "కావ్యన్న చలివేంద్రం"ను కావలి ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో ఎమ్మెల్యే స్వయంగా ప్రజలకు మజ్జిగ,మంచినీళ్లు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు దేవరకొండ శ్రీను, వారి మిత్రబృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా లారీ అసోసియేషన్ సభ్యులు మరియు వారి మిత్రులు పుల్లపు నాయుడు పేరుమీద యాచకులకు భోజనం మరియు దుస్తులు, పాదరక్షలు,పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవికాలంలో ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సేవ చేయడం గొప్ప విషయమని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లారీ అసోసియేషన్ సభ్యులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాయల చెరువు నిర్వాసిత బాధిత రైతులను ఆదుకోకుంటే ఈ నెల 11న
# కేవీబిపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా భారతీయ కిసాన్ సంఘ్...



సూళ్లూరుపేట, పెన్ పవర్, మే 7 తిరుపతి జిల్లా కెవిబి పురం మండలం ఓల్లూరు గ్రామంలోని రాయల చెరువుకు గత ఏడాది నవంబర్ లో 6 వ తేదీన గండిపడిన కారణంగా చెరువు కింద ఉన్న పంట పొలాలు, పంటలు,ట్రాక్టర్లు, వ్యవసాయ మోటర్లు కొట్టుకుపోవడం వ్యవసాయ బావులు పూడిపోవడం పైపులైన్లు దెబ్బ తినడం తీవ్రంగా నష్టపోవడం జరిగిందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి గురువారం రాయలచెరువు నిర్వాసిత గ్రామాలలో పర్యటించిన సందర్భంలో అన్నారు. ప్రభుత్వము రైతులను ఆదుకుంటామని నెల రోజుల్లో పరిహారం చెల్లిస్తామని ఆరు నెలలు అయినప్పటికీ ఇంతవరకు రైతుల ఖాతాలో ఒక్క రూపాయి జమ చేయలేదని అనేకసార్లు జిల్లా అధికారులని కలిసినప్పటికీ ఎవరు కూడా సరైన స్పందన చూపకపోవడం ప్రభుత్వము సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసే తరువాత మొహం చాటేయడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న వాళ్ళని పలకరించే దిక్కు లేదని ఆయన మండిపడ్డారు. బాధ్యత రైతు విషయంలో సంఘటన జరిగిన మొదటి నుంచి రైతులకు అండగా నిలబడి పోరాడుతున్నామని అయినా ప్రభుత్వంలో అధికారులలో చలనం లేకపోవడంతో రైతులను కలుపుకొని ఆందోళన చేయవలసి వస్తుందని ఈనెల 11వ తారీఖున కేవీపీ పురం మండలం తహసీల్దార్ కార్యలయం ఎదుట నిర్వాసిత బాధ్యత రైతులను కలుపుకొని ధర్నా నిర్వహిస్తామని. వారికి అందవలసిన పరిహారం రూపాయితో సహా వారి ఖాతాల్లో పడే వరకు వారికి అండగా భారతీయ కిసాన్ సంఘ్ ఉంటుందని తెలియజేశారు. రాయల చెరువు పడిన గండిని ఇంతవరకు పూడ్చకపోవడంతో రైతులకు సాగునీరు లేక పంటలను పండించుకోలేని పరిస్థితి ఏర్పడిందని గండి పూడ్చి ఉంటే నీరు నిల్వ ఉండి వ్యవసాయ బోర్లలో నీరు వచ్చి ఉండేదని గండి పూడచ్చని కారణంగా నీరు అడుగంటు పోయిందని పంటలు పండించుకోలేని పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పంటల మీద తెచ్చిన పంట రుణాలు వడ్డీలు పెరిగి కట్టలేని పరిస్థితుల్లో రైతుల కన్నీళ్లు పెడుతున్న ప్రభుత్వానికి అధికారులకు చలనం లేకుండా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వము వెంటనే రైతులకు రావలసిన పరిహారం ఇవ్వడంతో పాటు రాయల చెరువును గండిను పూడ్చి రైతులను ఆదుకోవాలని నష్టపోయిన రైతుల పంట రుణాలను మానవత దృక్పథంతో రద్దు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి. రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఇండ్ల.శశికిరణ్, రైతులు పరంధామ రెడ్డి, బాబు రెడ్డి, రామచంద్ర రెడ్డి, శేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విజయనగరం

విజయనగరం టౌన్ : పెన్ పవర్ మే 7. విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణం లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సాహం గా జరిగిన ఐదో ఎపి కప్ స్టేట్ తైక్వాండో ఛాంపి యన్‌షిప్ -- 2026 పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో ఆతిథ్య విజయనగరం జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ టోర్నీలో పాల్గొన్నారని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్ రావు తెలిపారు. విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయని చెప్పారు. పూమ్సే విభాగంలో కృష్ణా జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

# సాయి అపర్ణను సత్కరించిన డాక్టర్ చెన్నయ్య

## శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం గుమ్మళ్ళదిబ్బకు చెందిన పల్లా సాయి అపర్ణ



కోవూరు పెన్ పవర్ మే 7. జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి 10వ తరగతిలో 594 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా గురువారం గుమ్మళ్ళ దిబ్బ లోని అపర్ణ అమ్మమ్మ చౌడం సుజాత స్వగృహం నందు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ చీదరాల చెన్నయ్య సౌజన్యంతో సాయి అపర్ణ మొమెంటో, శాలువా, మాల, కిరీటం, 2016 నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ చీదరాల చెన్నయ్య మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో అత్యుత్తమ భోధనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంతటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరూ విజయ డంఖా మోగించారని తెలిపారు. పినాకిని అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. అమ్మమ్మ ఆదరణతో సాయి అపర్ణ 954 మార్కులు సాధించి జిల్లాకు పేరు తెచ్చిందని తెలిపారు. ఈకార్యక్రమంలో సాయి అపర్ణ అమ్మమ్మ సుజాత, స్వప్న మాధురి తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు కార్యక్రమంపై జొన్నవాడలో సమావేశం..



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 7. ఈ నెల 27, 28, 29 తేదీలలో కిసాన్ సెజ్‌లో జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ జొన్నవాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకులు ,కార్యకర్తలు మహానాడు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పార్టీ బలోపేతానికి మహానాడు వేదికగా నిలుస్తుందని, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పార్టీ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రయాణికులున్నా బస్సు ఆపరా ?



కంకిపాడు (కృష్ణా జిల్లా): పెన్ పవర్ మే 7. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆర్‌టిసి బస్సులు ఆపకపోవడంపై స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం కంకిపాడు వైపు నుంచి పెనమలూరు వెళ్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. కంకిపాడు కూడలిలో బస్సు ఆపకపోవడాన్ని గమనించారు. వెంటనే ఫాలో చేసిన ఆయన హైవేపై బస్సు ఆపి డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌టిసి సిబ్బంది వైఖరి బాగోలేదని వారిని మందలించారు. ప్రయాణికులు ఉన్నచోట బస్సు ఆపాలని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని సిబ్బందిని హెచ్చరించారు. గోసాల కూడలి వరకు బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే.. ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళా ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

# పొగాకు మార్కెట్ పతనం



ఒంగోలు: పెన్ పవర్ మే 7. పొగాకు మార్కెట్ రోజురోజుకూ పతనం దిశగా సాగుతోంది. గురువారం ఎస్‌బిఎస్ పరిధిలోని వేలం కేంద్రాల్లో 57.12 శాతం బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. బోర్డు అధికారులు వాటిని కొనుగోలు చేయించేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. వేలం తీరుపై విసుగెత్తిన రైతులు వేలం బహిష్కరించి ఒంగోలు-కర్నూలు రోడ్డుపై బైఠాయించారు. గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆందోళన చేపట్టారు. కిలో పొగాకు రూ.360కు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం నాటి కొనుగోళ్లను పరిశీలిస్తే ఎస్‌బిఎస్‌లో 1495 బేళ్లు రాగా 641 బేళ్లను కొనుగోలు చేశారు. 854 బేళ్లను తిరస్కరించారు. అంటే సగానికి పైగా బేళ్లను వెనక్కు పంపారు. రైతులు దిక్కుతోచని స్థితిలో మళ్లీ వాటిని వెనక్కి తీసుకువెళ్లారు. గరిష్ట ధర రూ.250 కాగా సగటు ధర రూ.233.68 పలికింది. ఎస్‌ఎల్‌ఎస్‌లో 2121 బేళ్లు రాగా 1470 బేళ్లను కొనుగోలు చేశారు. 651 బేళ్లను వెనక్కు పంపారు. ఇక్కడా 30.69 శాతం తిరస్కరణకు గురైంది. గతేడాది ఆఖరులో కిలో పొగాకు ధర రూ.300 దాటి పలికింది. ప్రస్తుతం రూ.250కు మించి పెరగలేదు. వ్యాపారులకు పోటీగా గతంలో మాదిరిగా కొనుగోలు చేయాలని అప్పుడే సీలింగు ధర బద్దలవుతుందని రైతులు చెబుతున్నారు.

